






దసరా శుభాకాంక్షలతో బీఆర్ఎస్ నేతల కలయిక

దశ, ఇబ్రహీంపట్నం: దసరా పండుగను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని నియోజకవర్గం లోని పలు ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎలిమినేడు వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరు ప్రాంతాల నాయకులు వారికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ నేపథ్యంలో నాయకుల మధ్య ఆత్మీయ వాతావరణం నెలకొంది. ఈ మర్యాదపూర్వక భేటీతో స్థానిక బీఆర్ఎస్ నాయకుల మధ్య పరస్పర సాన్నిహిత్యం మరోసారి ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో కమ్మగూడ, ఇంజాపూర్ ప్రాంతాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిప్పలపల్లిలో అంబరాన్నంటిన దసరా సంబురాలు



దశ, నార్కట్‌పల్లి: నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చిప్పలపల్లి గ్రామంలో దసరా సంబురాలు ఘనంగా నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో పండుగ సందడి నెలకొంది. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకుంటూ ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం వెల్లివిరియడంతో సందడి నెలకొంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని గ్రామస్తులు ఉత్సాహంగా జరుపుకున్నారు.

మాజీ సర్పంచ్ రాములమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న మర్రి నిరంజన్‌రెడ్డి



దశ, మంచాల: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం లోయపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కారింగు రాములమ్మ మృతి పట్ల టీపీసీసీ సభ్యుడు, ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కారింగు జంగయ్య గౌడ్ తల్లి రాములమ్మ మరణవార్త తెలుసుకున్న ఆయన బుధవారం లోయపల్లి గ్రామానికి చేరుకుని ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిద్దె శ్రీనివాస్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వేణుగోపాలరావు, సర్పంచ్ బాలు నాయక్, పాత్లోత్ శ్రీనివాస్ నాయక్, రామచంద్రయ్య, ఎట్టయ్య, నవీన్ గౌడ్, ధనంజయ, ఓరుగంటి మహేష్‌గౌడ్‌తో పాటు గ్రామస్తులు, బంధుమిత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన జీవన్‌కుమార్‌రెడ్డి

దశ, అబ్దుల్లాపూర్ మెట్ : దసరా పండుగను పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) లకు అబ్దుల్లాపూర్‌మెట్ వార్డు సభ్యుడు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్‌వై ప్రధాన కార్యదర్శి మొగుళ్ల జీవన్‌కుమార్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని కొండల్, గండం నరేష్, లింగాల అఖిల్, గడమిది యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరిగా రుద్రేశ్వరీదేవి దర్శనం

దశ, హైదరాబాద్ : విజయదశమి దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రేశ్వరీదేవిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం హంస వాహనంపై అమ్మవారిని కోనేరు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. కోనేరులో వేదమంత్రాల నడుమ త్రిశూల స్నానార్చనను వైభవంగా నిర్వహించారు. అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ, కోనేరు జలాలను భక్తులపై చల్లి ఆశీర్వదించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. సాయంత్రం భక్తులకు చిత్రాన్న ప్రసాదాన్ని పంపిణీ చేయడంతో పాటు, విజయదశమి సంప్రదాయంలో భాగంగా జమ్మి పత్రాలను అందజేశారు.

వివిఎస్టీ కాలనీలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు



దశ ఓయూ: హైదరాబాద్‌లోని నాచారం వివిఎస్టీ కాలనీలో వివిఎస్టీ ఫ్రెండ్స్ అండ్ ఫ్యామిలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు మెట్రో రైలు విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో ప్రజలు విద్యుత్తు, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. సంప్రదాయబద్ధంగా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించిన అసోసియేషన్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఇలాంటి వేడుకలు భక్తిభావంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

శిల్పి కాలనీలో ఘనంగా దసరా సంబరాలు



దశ, పెద్ద అంబర్‌పేట్: పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని శిల్పి కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కాలనీవాసులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కాలనీవాసులంతా కలిసిమెలిసి పండుగ వేడుకల్లో పాల్గొనడంతో శిల్పి కాలనీలో పండుగ సందడి నెలకొంది. ఈ వేడుకలు కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నింపాయి.

వెంకటేశ్వర కాలనీలో డ్రైనేజీ పనులు

ప్రారంభించిన మల్లెపూల శ్రీకాంత్ యాదవ్

దశ, హైదరాబాద్: చంద్రపురి కాలనీ డివిజన్‌లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.

ఇందులో భాగంగా వెంకటేశ్వర కాలనీలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులను మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానికుల అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చిట్టి బాబు, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, సీనియర్ నాయకులు రజిత గోపాల్, నర్ర మహేష్, భాస్కర్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం, మైనారిటీ అధ్యక్షుడు ఎండీ గౌస్‌తోపాటు స్థానికులు బషీర్, షఫీ, శ్రీరామ్, నాగరాజు, శ్రీనివాస్, ప్రవంతి, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంపై అధికారుల నిఘా

దశ, హైదరాబాద్: పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచుతున్నారనే అనుమానంతో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లిలోని న్యూ బన్సల్ రైస్ ఇండస్ట్రీస్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ నెల 20న ఉదయం 8.30 గంటల సమయంలో అందిన సమాచారంతో మిల్లును తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న బియ్యం బస్తాలతో పాటు, మిల్లుకు వచ్చిన లారీలోని బియ్యాన్ని గుర్తించి, వాటి కొనుగోళ్లు, సరఫరా వివరాలపై విచారణ చేపట్టాలని ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనిఖీల్లో మిల్లులో 50 కిలోల బరువున్న 677 బస్తాలు, 25 కిలోల బరువున్న 101 బస్తాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన టీఎస్03యూబీ3399 నంబరు గల టాటా లారీలో 50 కిలోల బరువున్న మరో 51 బియ్యం బస్తాలను గుర్తించారు. ఈ విధంగా మిల్లులో, లారీలో కలిపి మొత్తం 880 బస్తాల బియ్యం ఉన్నట్లు అధికారులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం బియ్యం నమూనాలను సేకరించి సాంకేతిక అధికారులతో పరీక్షించగా, వాటిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కే) ఉన్నట్లు నిర్ధారణ అయిందని సివిల్ సప్లైస్ అధికారులు తెలిపారు. దీంతో బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు? ఎవరి ద్వారా కొనుగోలు చేశారు? వాటి సరఫరాకు సంబంధించిన వివరాలేమిటి? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించారు. మిల్లుకు చెందిన యజమాని గీతేష్ బన్సల్ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం మోతే గ్రామ పరిధిలోని భారతి ఇండస్ట్రీస్ నుంచి బియ్యం కొనుగోలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో గీతేష్ బన్సల్‌తో పాటు బియ్యం సరఫరాకు సంబంధించి ప్రస్తావించిన శ్రీరామ్ లోహియా, భారతి ఇండస్ట్రీస్ యజమాని కపర్తి నాగభూషణం పాత్రపైనా విచారణ జరపాలని అధికారులు కోరారు. తెలంగాణ పీడీఎస్ రైస్ (కంట్రోల్) ఆర్డర్-2016లోని క్లాజ్ 17(ఈ) నిబంధన ఉల్లంఘన జరిగి ఉండవచ్చని ఆరోపిస్తూ సివిల్ సప్లైస్ శాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బియ్యం కొనుగోళ్లు, నిల్వలు, సరఫరాకు సంబంధించిన పత్రాలను పరిశీలించి, బియ్యం మూలాలను గుర్తించి, సంబంధిత వ్యక్తుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది.

పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

❖ ఎస్సై మల్లు సంజీవరెడ్డి ఎంజీఎల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల దినోత్సవ శాంతి ర్యాలీ



దశ, మునగాల: సమాజంలోశాంతి భద్రతల పరిరక్షణ కోసం, ప్రజలకోసం, ప్రజాశ్రేయస్సు కోసం పోలీసుఅమరవీరులు చేసిన ప్రాణత్యాగాలు వెలకట్టనేనివని ఎస్సై మల్లు సంజీవరెడ్డి అన్నారు. అక్టోబర్ 21పోలీస్ అమరవీరుల దినోత్సవ (ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంటప్రభుత్వ వైద్యశాల నుండి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు, ఎంజీఎల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల స్మారకార్థం సంఘీభావ శాంతి ర్యాలీ నిర్వహించారు.అనంతరం పోలీస్ స్టేషన్ నందు ఎంజీఎల్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు సిహెచ్ సీతారామ్ అధ్యక్షతన నిర్వహించిన సంఘీభావ శాంతి ర్యాలీ సభలో, మొదటగా సూర్యాపేట జిల్లాకు చెందిన పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు ఎస్సై సంజీవరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం, స్థానికపోలీస్ సిబ్బంది మరియు ఎంజీఎల్ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎస్సై సంజీవరెడ్డి మాట్లాడుతూ, విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలను ఫణంగా పెట్టి పోలీసులు సమాజ శ్రేయస్సు కోసం చేస్తున్న త్యాగాల్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు మేధావులు గుర్తించి పోలీసు అమరవీరుల కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలవాలని అన్నారు.

సమాజంలో పోలీస్ పాత్ర అత్యంత కీలకమని శాంతిభద్రతల పరిరక్షణ కోసం, మరియు సమాజంలో అల్లర్లు గొడవలు, కొట్లాటలు ఘర్షణలు చోటుచేసుకున్నప్పుడు, ఉత్సవాలు, వేడుకలు, జాతరలునిర్వహించుకునేటప్పుడు, సంతోష సమయంలో అయినా, ఆనందంలో అయినా, విషాదంలో అయినా అనునిత్యం పోలీస్ శాఖ అందించే సేవలు వెలకట్టలేనివని ఆయన తెలిపారు. సమాజంలో ప్రతి వ్యక్తిపోలీస్ శాఖ సూచనలు తప్పక పాటించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని, నేటిసమాజంలో హింస, నేర ప్రవృత్తి, దొంగతనాలు, మత్తు పదార్థాల వాడకం, సంఘవ్యతిరేక కార్యకలాపాలైన ఉగ్రవాదం , తీవ్రవాదం, వంటి సమస్యలు మనముందు జటిలంగా ఉన్నాయని, అన్నిటినీ ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించడం దేశ పౌరుల ప్రాథమిక బాధ్యత అని ఆయనసూచించారు. సమాజ హితం కోసం తమ ప్రాణాలను ఫణంగా వీరమరణం పొందిన పోలీసు అమరుల కుటుంబాల స్మారకార్థం ఎంజీఎల్ ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల స్మారక శాంతి ర్యాలీ నిర్వహించడాని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఎంజీఎల్ క్లబ్ అధ్యక్షుడు ఎస్ నరసింహారావు, సభ్యులు తాటికొండ శ్రీనివాస్, పసుపులేటి వెంకన్న, బి గోవర్ధన్, కందిబండ హరీష్, ఎస్ గోపి, మునగాల గ్రామ యువకులు పురుషోత్తం బాబు, జానీమియా, వేట అశోక్, గడ్డం వినోద్, పసుపులేటి సందీప్, ముత్యాల యశ్వంత్, తంగేళ్ల సందీప్, అనంతుల శివ, దేవరం శ్యామ్ ,తదితరులు పాల్గొన్నారు.

చిన్న రాంచర్లలో దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన .పల్లా రాజేశ్వర్ రెడ్డి

దశ, జనగామ: జనగామ నియోజకవర్గంలోని బచ్చన్నపేట మండలం చిన్న రాంచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి ఆశీస్సులు పొందారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవాల నిర్వాహక కమిటీ సభ్యులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు

జనగామలో డీసీపీ రాజా మహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

దశ, జనగామ: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జనగామలో పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనగామ డీసీపీ రాజా మహేంద్ర నాయక్, ఐపీఎస్ ఆధ్వర్యంలో జనగామ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. వారి సేవలు, అంకితభావం పోలీస్ శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

❖ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన వీరుల సేవలు చిరస్మరణీయం: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

దశ, జనగామ: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రఘునాథపల్లి మండల పరిధిలోని పోలీస్ స్టేషన్లో డీసీపీ రాజా మహేంద్ర నాయక్తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుతున్న నేర ధోరణులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాలను వేగంగా ఛేదిస్తున్న పోలీసుల పనితీరును అభినందించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐలు వేణు, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, దేవేందర్, భరత్ సుమన్, స్థానిక ఎస్ఐ మోదుగు భరత్తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

వృద్ధురాలి పుస్తెలతాడు చోరీ చేసిన జంట అరెస్ట్




❖ హస్తినాపురం ఆలయంలో ఘటన
❖ మూడు రోజుల్లోనే కేసు ఛేదన
❖ 30 గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

దశ, హైదరాబాద్: ఆలయంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా అపహరించిన కేసులో వనస్థలిపురం పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడుతోపాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఘటన జరిగిన మూడు రోజుల్లోనే కేసును ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 18న ఉదయం 6.04 గంటలకు హస్తినాపురంలోని వెంకటరమణ కాలనీ రాజరాజేశ్వరి ఆలయంలో ఆండుగుల రాములమ్మ (66) శుభ్రం చేస్తుండగా అక్కడికి వచ్చిన ఇద్దరు నిందితులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. మహిళా నిందితురాలు వృద్ధురాలిని గట్టిగా పట్టుకుని నోరు మూయగా, పురుష నిందితుడు ఆమె మెడలోని సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడును లాక్కున్నాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. ఆభరణాన్ని విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లినప్పటికీ కొనుగోలుదారులు లభించకపోవడంతో, నడికుడి రైల్వే స్టేషన్ సమీపంలో వాహనాన్ని నిలిపి రైలులో హైదరాబాద్‌కు తిరిగివచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు అక్టోబర్ 21న కమలానగర్‌లోని ఓ నగల దుకాణం సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని అన్నపురెడ్డి దుర్గ రమణారెడ్డి (23), తంక వరలక్ష్మి (24)గా గుర్తించారు. వారి నుంచి బంగారు పుస్తెలతాడుతోపాటు రియల్‌మీ, వివో వై31కు చెందిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ పర్యవేక్షణలో వనస్థలిపురం డివిజన్ ఇన్‌చార్జి ఏసీపీ టి. కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో ఈ కేసును ఛేదించారు. వనస్థలిపురం ఎస్‌హెచ్‌ఓ ఎస్. రవిబాబు, డీఐ బి. రాజేష్, డీఎస్‌ఐ వి. రవి, ఎస్‌ఐ డి. మల్లయ్య తదితరులు దర్యాప్తులో పాల్గొన్నారు. ఆలయాలు, పార్కులు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఒంటరిగా ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ కరుణాకర్‌రావు ప్రజలకు సూచించారు.

బతుకమ్మ తెప్పలను ప్రారంభించిన ప్రభుత్వ విప్



దశ, రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో నిర్మించిన నాలుగు బతుకమ్మ తెప్పల నిర్మాణం పూర్తి కాగా బుధవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ. 25 లక్షలు మంజూరు చేసి నాలుగు బతుకమ్మ తెప్పలను నిర్మించడం జరిగిందని అన్నారు. మహిళల కోరిక మేరకు బతుకమ్మ తెప్పల నిర్మాణం చేపట్టడం జరిగిందని, ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, మహిళల అధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఈ తెప్పలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. బతుకమ్మ ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తున్న సర్పంచ్ మరియు పాలకవర్గన్ని అభినందించారు. రుద్రంగి ఒకే గ్రామానికి నాలుగు బతుకమ్మ తెప్పలు మంజూరు చేసినందుకు మహిళల తరపున ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, ఏఎంసీ చేర్మెన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య మరియు నాయకులు పాల్గొన్నారు.



పెద్దమారూర్‌లో ఘనంగా దుర్గామాత నిమజ్జనం

❖ భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలకు ముగింపు
❖ భజన పాటలు, యువత నృత్యాలతో గ్రామంలో సందడి

దశ, చిన్నంబావి: మండలంలోని పెద్దమారూర్ గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గామాత నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారికి గ్రామస్తులు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు.అమ్మవారి నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నిమజ్జనోత్సవంలో భజన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు భక్తిగీతాలు ఆలపిస్తూ అమ్మవారిని స్మరించుకున్నారు. భజన పాటలకు అనుగుణంగా యువత, భక్తులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో భక్తుల సందడి నెలకొనగా, చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామస్తులంతా ఉత్సవంలో భాగస్వాములై అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామస్తులంతా ఐకమత్యంతో శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించగా, నిమజ్జన కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి. భక్తి, సంప్రదాయం, సామూహిక భాగస్వామ్యంతో సాగిన ఈ ఉత్సవాలు గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపాయి. దుర్గామాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.

పూర్ణాహుతితో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



❖ భక్తిశ్రద్ధలతో 9 రోజులు పూజలు
❖ కన్నుల పండుగ శోభాయాత్ర

దశ, కామేపల్లి : గత తొమ్మిది రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు పూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి.మండలకేంద్రమైన కామేపల్లిలోగురుమందిరం,ఎంపీ సెంటర్,రామకృష్ణాపురం సువర్చల ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాలలో దుర్గామాతల విగ్రహాలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజులు 9 రూపాలుగా అలంకరించి ప్రత్యేక పూజలు,అభిషేకాలు,హోమాలు జరుపుకున్నారు.

ఉదయం సాయంత్రం వేళల్లో అనేక మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించు కున్నారు. ఈ సందర్భంగా దేవి విశిష్టతలను అర్చకులు భక్తులకు వివరించారు. విద్యార్థులతో సరస్వతి పూజ, ఆయుధ పూజ,వాహన పూజలుతో పాటు రావణాసురుడు సంహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యం హనుమాన్ చాలీసా పారాయణం, భగవన్నామ సంకీర్తనలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య పూర్ణాహుతితో ముగిశాయి.

అనంతరం సాంప్రదాయ నృత్యాలతో కోలాటాల మధ్య విగ్రహాలను కృష్ణా జలాలులో నిమజ్జనం చేసేందుకు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమాల్లో భక్తమండలి అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ, మహంకాళి రామ నరసయ్య, దమ్మాలపాటి శివాజీ, రఘు, వినయ్ కుమార్,నాగు బండి హనుమంతరావు, నాగేష్, రవి, డాక్టర్ పూజల శివకృష్ణ, యుగంధర్, సత్యనారాయణ, సతీష్, నవీన్, సాయి, స్వర్ణ కుమార్, తోట రాము, రామకృష్ణ, గోవర్ధన్,గండు సాగర్, అజ్మీర రమేష్, శ్రీనివాస్, ఉపేందర్, మంజునాథ్, రేవంత్, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



దశ, మంగపేట: మంగపేట మండలం కమలాపురంలోని చారిత్రక శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆలయం 21వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కొలువై ఉన్న దుర్గామాత ఊరేగింపు (శోభాయాత్ర) బుధవారం కనులపండువగా జరిగింది.ఈ ఏడాది నవరాత్రి వేడుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ప్రతి ఏటా జరిగే ఉత్సవాల కంటే భిన్నంగా, ఈసారి అమ్మవారు వివిధ రూపాలు, విశేష వేషధారణలతో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలతో దీప్తివంతంగా వెలిగిపోతున్న దుర్గామాత ప్రతిమలను ప్రధాన వీధుల గుండా ఘనంగా ఊరేగించారు. భక్తుల కోలాహలం, మంగళవాయిద్యాల చప్పుళ్ళు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఈ శోభాయాత్ర సాగింది.